క్లుప్తంగా

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



రాయితీ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ

ఆస్పరి: ప్రభుత్వం అందించే రాయితీ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పరి మండల వ్యవసాయ అధికారి నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తంగరడోణ, ముత్తుకూరు, ములుగుందం గ్రామాల్లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 120 మంది రైతులకు 225 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. క్వింటాల్ వేరుశనగ విత్తనాలు రూ. 9,500 ఉండగా, ప్రభుత్వ రాయితీ 40 శాతం (రూ.3,800) పోను రైతు రూ.5,700 చెల్లించాలన్నారు. ఖరీఫ్‌లో పంటలు సాగుచేసే రైతులు సమీప ఆర్బీకే సిబ్బంది ద్వారా సలహాలు సూచనలు పొందాలని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి



ఏఎన్‌ఎంలకు సూచనలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్

చిప్పగిరి: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ షేక్ అఫ్రోజ జాన్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా ఆరోగ్య కేంద్రానికి వచ్చేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రేణుకా ఎల్లమ్మకు బోనాలు



బోనాలతో వెళ్తున్న భక్తులు



అలంకరణలో ఎల్లమ్మ

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎల్లమ్మ తిరునాలను పురస్కరించుకుని శుక్రవారం బోనాలు సమర్పించే కుటుంబాలతో వెల్దుర్తి పట్టణం హోరెత్తింది. మహిళా భక్తులు కుటుంబ సమేతంగా మేళతాళాలతో బోనాలు తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేకాలంకరణలో దర్శనమివ్వగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొగర్చేడులో కార్డెన్ సెర్చ్



తొగర్చేడు గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

కృష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో సీఐ సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి బృందం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పలువురు రాజకీయ నేతలు, అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం సీఐ గ్రామస్తులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు. ఆవేశాలు అనర్థాలకు దారితీస్తాయని, గొడవలు రేపేవారెవరైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

పత్తికొండలో భారీ వర్షం



పత్తికొండలో కురుస్తున్న వర్షం

పత్తికొండ రూరల్: పత్తికొండలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు సాయంత్రం వీచిన గాలులు ఆహ్లాదాన్ని అందించాయి. రాత్రి 7.30గంటల నుంచి భీకరమైన ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. భారీగా వీచిన ఈదురుగాలులకు పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడడంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వర్షపు నీటితో ప్రధాన రోడ్లు, లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. వంకల్లో వరద నీరు ప్రవహించింది. వేసవి దుక్కులకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పంట మార్పిడితో బహుళ ప్రయోజనాలు

- చీడపీడల నుంచి రక్షణ
- ఒకే పంట సాగుతో అనర్థాలు



విత్తనం విత్తుతున్న కూలీలు (ఫైల్)

హొళగుంద: రైతులు తమ పొలంలో ఒకసారి సాగు చేసిన పంటనే మళ్లీమళ్లీ సాగు చేస్తుండటంతో నేలలో సారం తగ్గిపోయి పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. దీంతో నష్టాలు చవిచూస్తున్నారు. పంట మార్పిడి చేయకపోవడంతో చీడపీడలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంటుంది. వాణిజ్య పంటలు లాభదాయకంగా ఉన్నందున రైతులు ఒకే పంటను ప్రతి సీజన్‌లో సాగు చేస్తున్నారు. దీని వలన భూసారం క్షీణించడంతోపాటు పంటలపై చీడపీడలు విజృంభించి దిగుబడులు క్రమేపి తగ్గుతున్నాయి. 2 లేదా 3 సంవత్సరాలకోసారైన పంట మార్పిడి చేస్తేనే చీడపీడలను అదుపులో ఉంచే అవకాశం ఉంటుంది. దీనిపై చాలా మంది రైతులకు అవగాహన లేదు. పంట మార్పిడితో భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెంది చీడపీడలు దూరమవుతాయని వ్యవసాయాధికారి నరేంద్రకుమార్ తెలిపారు. ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గించవచ్చు. భూమిలో నాణ్యత పెరిగి దిగుబడులు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.

పంట మార్పిడితో లాభాలు

- చీడపీడలను అదుపులో ఉంచవచ్చు. ఒక పంటను ఆశించిన చీడపీడలు రెండవ పంటను ఆశించవు.
- మొక్కజొన్న వేసిన పొలంలో మిరప పంట సాగు చేయకుండా ఉంటే మంచిది. మిరపను సాగుచేస్తే నష్టం తప్ప లాభం వచ్చే అవకాశం లేదు.
- మిశ్రమ విధానంలో రెండు లేదా మూడు పంటలను సాగుచేయడం వల్ల ఒక పంటకు గిట్టుబాటు ధర లేకున్నా ఇతర పంటల వల్ల తగిన ఆదాయం పొందవచ్చు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చు.
- రైతులందరూ ఒకే పంటను సాగు చేయడం ద్వారా చీడపీడల ఉధృతి అధికమై దిగుబడులు తగ్గడమే గాక మార్కెట్లో గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నారు. మిర్చి, పత్తి, పొగాకు రైతుల అనుభవాలు మనకు తెలిసిందే.
- పంట మార్పిడి వల్ల చీడపీడలు అదుపులో ఉంటాయి. సస్యరక్షణ కోసం వాడే పురుగు మందుల ఖర్చు తగ్గించవచ్చు.
- వేర్లు తక్కువ లోతుకు చొచ్చుకొని పోయే పైర్లను, ఎక్కువ లోతుకు చొచ్చుకొని పోయే పైర్లతో మార్పిడి చేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ పోషకాలను సమర్థంగా వినియోగించుకుంటాయి.
- పత్తి వేసిన పొలంలో మిరప పంటను సాగు చేస్తే లాభసాటిగా ఉంటుంది.
- మిరప పంట వేసిన పొలంలో పత్తి పంట సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో సాగు దిగుబడులు కూడా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతేకాకుండా మిరప పంట సాగు చేయడానికి ముందు సదరు భూమిలో జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పంటలను సాగుచేసి నేలలో కలియదున్ని పంటను సాగు చేస్తే భూసారం పెరిగి చీడపీడలు దరిచేరవు.
- నులి పురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి.
- వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము పంటలను వేయడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.
- వరి పంట తర్వాత పప్పుధాన్యాల పంటలను కానీ నూనె గింజల పంటలను కానీ సాగు చేయడం వలన తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి.
- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదిలో రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.
- తేలికపాటి నేలలు ఎర్ర ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలను సాగు చేసుకోవచ్చు.
- కంది మొదలగు పంటలను సాగు చేయడం వలన కింది పైరు ఆకులు రాలి కుళ్లిపోవడం వల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరిగి భూ భౌతికస్థితి మెరుగుపడి భూసారం వృద్ధి చెందుతుంది. నేలలో నీటిని పట్టి ఉంచే శక్తి గణనీయంగా పెరిగి, తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయి. వేరుశనగ, కంది, పప్పుశనగ మొదలగు సాగు చేయటం వలన వాటి వేర్ల బుడిపెలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజని స్థిరీకరించి నేలను సారవంతం చేస్తుంది.
- వాతావరణ కాలుష్యాన్ని నివారించి ప్రకృతిలో సమతుల్యతను పెంచడానికి వీలు కలుగుతుంది.

నాడు శిథిలం.. నేడు అద్భుతం



నాడు- శిథిలావస్థలో..

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో గతంలో గ్రామ సచివాలయం లేక సంబంధిత అధికారులు పక్కనే ఉన్న మసీదులో విధులు నిర్వహిస్తూ ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 2 వేల జనాభా కలిగిన ప్రతి గ్రామానికి ఒక సచివాలయం మంజూరు చేశారు. ఫలితంగా గ్రామంలో రూ.40 లక్షలతో నూతన భవనం నిర్మించారు. అధికారులు సజావుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి శాఖకు ఒక అధికారిని నియమించడంతో గ్రామస్తులకు సమస్యలు తీరాయి.



నేడు - కళకళలాడుతున్న గ్రామ సచివాలయం

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల కోసం ఆలూరులోని ప్రభుత్వ బాలుర–1,2 పాఠశాలలు, జెడ్పీ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్, సెయింట్ జాన్స్ స్కూల్‌లో 5 సెంటర్లు ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 299 మంది దరఖాస్తు చేసుకోగా..179 మంది విద్యార్థులు హాజరయ్యారు. 120 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల సెంటర్ చీఫ్‌లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. సీసీ కెమెరాల స్ట్రీమింగ్‌తో పాటు పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పించారు.

ఇంటర్ పరీక్షలకు 118 మంది హాజరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షకు 85 మందికి గాను 83 మంది విద్యార్థులు, సెకండ్ ఇయర్ 38 మందికి గాను 35 మంది విద్యార్థులు హాజరయ్యారు. 5 విద్యార్థులు హాజరు కాలేదని కళాశాల చీఫ్ మాధవి తెలిపారు.

రాయితీ విత్తనాలకు డిమాండ్

- ముందస్తు వర్షాలతో పెరగనున్న వేరుశనగ సాగు



వెల్దుర్తి ఆర్బీకేలో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

కృష్ణగిరి: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగుచేసే రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలకు డిమాండ్ పెరిగింది. గత ఖరీఫ్‌లో పత్తి దిగుబడులు సరిగ్గా రాకపోవడం, ప్రస్తుత ముందస్తు వర్షాల ప్రభావం, 40 శాతం రాయితీతో క్వింటాల్ కేవలం రూ.5,700లకే లభిస్తుండడంతో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో వేరుశనగ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఇరు మండలాల్లోని ఆర్బీకేల్లో వేరుశనగ విత్తనాలు కావలంటూ రిజిస్ట్రేషన్లు, వెనువెంటనే పంపిణీ ప్రక్రియ ఊపందుకుంది. కృష్ణగిరి మండలానికి 1100 క్వింటాళ్లు, వెల్దుర్తి మండలానికి 750 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు మంజూరు కాగా కృష్ణగిరి మండలంలో ఇప్పటికే 850 క్వింటాళ్ల విత్తనాలు, వెల్దుర్తి మండలంలో 620 క్వింటాళ్ల విత్తనాల పంపిణీ పూర్తయినట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు (ఏఓలు) వెంకటేశ్వర్లు, అక్బర్‌బాషా తెలిపారు. ఇంకా పలువురు రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకుని ఉండడం, చాలామంది వేరుశనగ విత్తుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమ మండలాలకు మరిన్ని సబ్సిడీ విత్తనాలు మంజూరు చేయాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. తాము సైతం మరిన్ని విత్తనాలు కేటాయించాలంటూ ఉన్నతాధికారులకు నివేదించినట్లు అధికారులు తెలిపారు.

ప్రారంభమైన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు వెల్దుర్తి మండల కేంద్రంలోని బాలుర, బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లలో, ఎస్సీ గురుకులంలో రెండు కేంద్రాలుగా పరీక్షలు నిర్వహించారు. ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు పరీక్ష నాలుగు కేంద్రాల్లో నిర్వహించినట్లు ఎంఈఓ ఇందిర తెలిపారు. వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల ఇంటర్ విద్యార్థులకు వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కృష్ణగిరి మోడల్ స్కూల్ కేంద్రాలుగా ఫస్ట్ లాంగ్వేజ్ ఉదయం, సాయంత్రం ఫస్టియర్, సెకండియర్ పరీక్షలు నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ సీఎస్ రవిచంద్ర, ఏసీఎస్ రమణారెడ్డి, సీఎస్ నిర్మలాదేవి తెలిపారు.

హొళగుందలో 45 మంది గైర్హాజరు

హొళగుంద: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏ, బీ రెండు సెంటర్లలో హొళగుంద, ఎల్లార్తి, హెబ్బటం, సుళువాయి, గజ్జహళ్లి హైస్కూళ్లతో పాటు కేజీబీవీ విద్యార్థులు పరీక్షలు రాశారు. మొదటి రోజు లాంగ్వేజ్ సబ్జెక్టులైన కన్నడ, తెలుగు, ఉర్దూ పేపర్–1 పరీక్షలు జరిగాయి. ఈ రెండు సెంటర్లలో 122 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 45 మంది గైరాజరైనట్లు పరీక్ష కేంద్రాల చీఫ్‌లు పర్వద్‌బేగం, కబీర్‌సాబ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు అయ్యప్ప, వెంకటేష్ తెలిపారు.

తుగ్గలిలో 35 మంది..

తుగ్గలి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, నోవీ కాన్సెప్ట్ స్కూల్‌లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. తొలి రోజు తెలుగు పరీక్షకు 96 మంది విద్యార్థులకు గాను 61 మంది హాజరయ్యారు. 35 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో–2 రామ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షకు నలుగురు గైర్హాజరు

మద్దికెర: స్థానిక శ్రీవిద్యాసాయి జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షకు 32 మంది విద్యార్థులకు గాను 28 మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ కిరణ్మయి తెలిపారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 47 మందికి గాను 46 మంది హాజరయ్యారని.. ఒక విద్యార్థి ఆబ్సెంట్ అయ్యారని పేర్కొన్నారు.

27 నుంచి విత్తనాల పంపిణీ

మద్దికెర: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ రవి అన్నారు. శుక్రవారం మండలంలోని హంప, ఎం.అగ్రహారం గ్రామాల్లో విత్తన నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులు త్వరగా నమోదు చేసుకుంటే సోమవారం నుంచి విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువతి అదృశ్యం

దేవనకొండ: మండలంలోని బండగట్టు గ్రామానికి చెందిన యువతి సుంకులమ్మ (23) బుధవారం రాత్రి నుంచి కనిపించడం లేదని యువతి అన్నయ్య కురువ కృష్ణ శుక్రవారం దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోనెగండ్ల మండలం వీరంపల్లికి చెందిన వీరేష్‌పై తమకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని యువతి కోసం గాలిస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

పల్లకీలో మహానందీశ్వరుడి విహారం



మహానందిలో పల్లకీ సేవ


మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, బలిహరణ పూజల అనంతరం స్వామి, అమ్మవార్లు ఆలయ ప్రాకారాల్లో విహరించారు.

తగ్గని రద్దీ

మహానందిలో భక్తులరద్దీ తగ్గడం లేదు. వేసవిసెలవులు ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తజనం తరలివస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

టీబీ డ్యాంకు మొదలుకాని ఇన్‌ఫ్లో

- ప్రస్తుతం 3.3 టీఎంసీల నీరు నిల్వ



హొస్పేట్ వద్ద ఉన్న టీబీ డ్యాం

హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో ఇంకా మొదలుకాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఇదే సమయంలో అకాల వర్షాల కారణంగా అడపాదడపా జలాశయానికి వరద నీరు చేరుతుండేది. గతేడాది మే 7వ తేదీ నుంచి డ్యాంలో నీటి చేరిక మొదలై ఈ సమయానికి 1,235 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి వస్తుండగా 4.140 టీఎంసీల నీరు నిల్వ ఉండేవి. అయితే ఈ ఏడాది ఇప్పటికీ ఇన్‌ఫ్లో జీరో ఉండగా నీటి నిల్వ 3.365 టీఎంసీలుగా ఉంది. జలాశయం నుంచి అన్ని కాలువలకు నీటి విడుదలను నిలిపి వేసి కేవలం రాయబసవన కాలువకు 12 క్యూసెక్కుల నీటిని మాత్రమే వదులుతున్నారు. గత కొద్ది రోజులుగా నీటి నిల్వలో మార్పు కనబడకపోగా ఆవిరి రూపంలో నీటిమట్టం తగ్గుతోంది. శుక్రవారం డ్యాంలో 1577.47 అడుగుల వద్ద 3.365 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ మొదటి వారం నుంచి జలాశయానికి నీటి చేరిక మొదలయ్యే అవకాశాలున్నట్లు టీబీ బోర్డు అధికారులు తెలిపారు.

హొళగుందలో నీటి కష్టాలు



తాగునీటిని పట్టుకునేందుకు వేచిఉన్న కుటుంబసభ్యులు

హొళగుంద: మండల కేంద్రంలోని 5వ వార్డు, దేవమ్మ వీధి తదితర కాలనీలలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. అంతంత మాత్రంగా ఉన్న సమస్య వేసవి కాలంలో తీవ్రమైంది. ఏళ్ల కిందట వేసిన పైప్‌లైన్‌తో ఇప్పుడున్న జనాభాకు తగ్గట్టుగా నీటి సరఫరా జరగడం లేదు. వారాల తరబడి నీరు సరఫరా గాకపోగా ఎప్పుడో ఒక సారి వదిలే నీరు సరిపోక ప్రజలు పంచాయతీ కార్యలయానికి వెళ్లి వాటర్‌మెన్‌లతో గొడవకు దిగుతున్నారు. ఇంటికి రెండు బిందెలు కూడా రాని పరిస్థితి నెలకొనడంతో మంచినీటి కోసం పడరాని పాట్లు పడ్తున్నారు. మహిళలు, చిన్న పిల్లలు తేడా లేకుండా నీటి కోసం గంటల తరబడి ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అయినా అరకొరగా వచ్చే నీరు ఒకటి, రెండిళ్లకు కూడా సరిపోవడం లేదని ఆయా కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పైప్‌లైన్ మార్చి ఆయా వీధుల్లో నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు దరఖాస్తు చేసుకోండి



ఆలూరు ఆర్‌ఓ డి. రామునాయక్

ఆలూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను పరిశీలించేందుకు ఆయా రాజకీయ పార్టీల ఏజెంట్లు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్ సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. క్రిమినల్ కేసుల్లో జైలు శిక్షను అనుభవించిన వారు, ప్రభుత్వం నుంచి జీతభత్యాలను పొందేవారు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రేషన్ షాపుల డీలర్లు ఏజెంట్లుగా ఉండేందుకు అనర్హులన్నారు. కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ బ్లాక్ 2వ ఫ్లోర్, రూం నంబర్ 205, 207 లలో ఎమ్మెల్యే అభ్యర్థుల ఓట్లు లెక్కింపు జరుగుతుందన్నారు. ప్రస్తుతం 14 టేబుళ్లతో పాటు అదనంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించడానికి మరో టేబుల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌ఓ తెలిపారు. అనుమతి పొందిన ఏజెంట్లు జూన్ 4న ఉదయం 6 గంటలకు ఫారం–18పైన సంతకాలతో కూడిన దరఖాస్తులతో కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. తప్పని సరిగా ఆధార్ కార్డు, గుర్తింపు కార్డుతో పాటు ఫారం–17 సి కలిగి ఉండాలన్నారు. కేంద్రంలోకి ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని, ఒక్కసారి కౌంటింగ్ హాల్లోకి వెళ్లిన వారికి ప్రక్రియ పూర్తయ్యే వరకు బయటకు పంపమని వెల్లడించారు.

పాడిపశువులకు టీకాలు వేయించాలి



ఏహెచ్‌ఏ సిబ్బందితో సమావేశమైన ఏడీఏ డాక్టర్ సి.విక్టర్‌బాబు

ఆలూరు: పాడి పశువులకు సీజనల్ వ్యాధులు సోకుండా టీకాలు వేయించాలని, దీనిపై గ్రామాల్లోని రైతులకు పశు సంవర్థక శాఖ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని ఆలూరు పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ సి.విక్టర్‌బాబు సూచించారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలు – బళ్లారి రోడ్డు సమీపంలోని పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఆలూరు, చిప్పగిరి మండలాల్లోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న పశుసంవర్థక శాఖ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పశువులకు హెచ్‌ఎస్‌ఎస్, బీక్యూ, మేకలు, గొర్రెలకు ఎఫ్‌టీ వ్యాక్సిన్ వేయించాలన్నారు. పాడి పశువులు, జీవాలకు మురుగు కుంటల్లో నిల్వ ఉన్న నీటిని తాగించరాదని, వంకలలో పారే నీటిని తాగించాలని సూచించారు. అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బోధనలో ఆదర్శం



ఆలూరులోని మోడల్ స్కూల్

- పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు
- నాడు–నేడు ద్వారా పాఠశాలలో పూర్తిస్థాయి వసతులు
- ఏటా ఎన్‌ఎంఎంఎస్‌లో ప్రతిభ చాటుతున్న వైనం
- మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: కార్పొరేట్ పాఠశాలలను తలపించేలా అధునాతన భవనాలు.. ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన వసతులు, అత్యుత్తమ విద్యాబోధనతో ఆలూరు ఆదర్శ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా రూ.40 లక్షలతో పాఠశాలను పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. పాఠశాలలో సౌకర్యాలు, ఈ ఏడాది విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలు చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను ఆదర్శ పాఠశాలలో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది 6వ తరగతిలో ప్రవేశాల కోసం 400 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాశారు.

విద్యార్థులకు వరం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆలూరు ఆదర్శ పాఠశాల వరంగా మారింది. 2013లో ప్రారంభమైన ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ప్రస్తుతం 642 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు పరిశీలనాత్మక, సృజనాత్మక పద్ధతుల్లో విద్యాబోధన చేస్తున్నారు. అధునాతన తరగతి గదులు, డెస్కులు, డిజిటల్ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఉన్నాయి. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు.

పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు

ఏటా పది, ఇంటర్ ఫలితాల్లో 80 శాతం కంటే ఎక్కువ ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు 92 శాతం, ఇంటర్మీడియెట్‌లో 62 శాతం ఉత్తీర్ణత సాధించారు. పదిలో 15 మంది విద్యార్థులకు 500కు పైగా మార్కులు, 25 మంది 400 లకు పైగా మార్కులు వచ్చాయి. అలాగే ఏటా ఎన్‌ఎంఎంఎస్‌లో (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) 10 నుంచి 15 మంది విద్యార్థులు ఎంపికవుతున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా స్థాయి సెపక్ తక్రా పోటీలకు 45 మంది, రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా క్రీడలకు 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

బాలికలకు హాస్టల్ వసతి

ఏపీ మోడల్ స్కూల్‌లో 9 నుంచి ఇంటర్ చదువుతున్న బాలికల కోసం స్కూల్ ఆవరణలోనే హాస్టల్ వసతి ఉంది. ప్రస్తుతం ఇందులో 100 మంది విద్యార్థులు ఉంటున్నారు. మూడు పూటల పౌష్టికాహారం అందిస్తున్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు మంచాలు, ఫ్యాన్లు, చదువుకోవడానికి డెస్కులు వంటి అన్ని వసతులు ఉన్నాయి. హాస్టల్ వసతితో మంచిగా చదువుకోవాలన్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి వరం.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పాఠశాలలో ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యాబోధనతో పాటు డిజిట్ పాఠాలు చెబుతున్నాం. ఏటా ఎన్‌ఎంఎంఎస్ కోసం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. 6వ తరగతి ప్రవేశానికి రాత పరీక్ష నిర్వహించాం. 400 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్‌లో చేరడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. బాలికలకు హాస్టల్ సౌకర్యం ఉంది. విద్యార్థులు చదువుతో పాటు క్రమ శిక్షణతో మెలిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

–రాఘవరావు ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, ఆలూరు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పత్తికొండ, ఆలూరు

97054 44304 (ఆలూరు, పత్తికొండ)

Office mail : sakshiknladvt@gmail.com